వలంటీర్లకు ప్రజల్లో అపార గౌరవం

- ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి


పురస్కారాలు పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి

కదిరి అర్బన్: ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సంక్షేమ పథకాలను ముంగిటకే అందజేస్తున్న వలంటీర్లకు ప్రజల్లో అపారమైన గౌరవం ఉందని ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి కొనియాడారు. కదిరి పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్‌హాల్‌లో ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అంజనప్ప ఆధ్వర్యంలో శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 169 మందికి సేవా మిత్ర పురస్కారాలు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. వలంటీర్ల సహకారంతో సంక్షేమ పథకాలను పేదల ముంగిటికే అందజేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌ను మరోమారు గెలిపించుకుని మరిన్ని సంక్షేమ పథకాలు మీ ద్వారా ప్రజలకు చేర్చాలని వలంటీర్లకు సూచించారు. ప్రజా ప్రతినిధుల కంటే వలంటీర్లకే ఎక్కువ గౌరవం ఉందంటే అది ముఖ్యమంత్రి మీకు ఇచ్చిన ప్రాధాన్యత అని అన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలతో ప్రజలు విసిగి వేసారిపోయారని చెప్పారు. నేడు ప్రతి పథకం పైరవీ లేకుండా, లంచం లేకుండా వలంటీర్ ఇంటివద్దకే చేరుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్, సర్పంచ్‌లు చలపతినాయక్, నారాయణ నాయక్, మాజీ సర్పంచ్ ఇంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు మధుకర్‌రెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మణికంఠనాయక్, విశ్వనాథ్, సింగిల్ విండో అధ్యక్షుడు ప్రసాద్, ఇర్షాద్, శ్రీనివాసులు నాయక్, రాంప్రసాద్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అల్లాబకాష్, ఎంపీటీసీ కుమార్‌రెడ్డి, నరసింహులునాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు


పుట్టపర్తిలో కుటుంబ సభ్యుల మధ్య కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

- శుభాకాంక్షలు తెలిపిన వైఎస్సార్ సీపీ ప్రముఖులు, నాయకులు

పుట్టపర్తి: పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పుట్టపర్తిలోని తన కార్యాలయంలో సతీమణి అపర్ణారెడ్డి, కుమారుడు, కుమార్తె, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకుల నడుమ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. నియోజకవర్గం నుంచి జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు,కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని పెద్దలు ఆశీర్వదించారు. ఉమ్మడి జిల్లాల జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, పామిడి వీరా, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, పుడా చైర్‌పర్సన్, జిల్లా మెప్మా అధ్యక్షురాలు, జిల్లా, మండలాల అగ్రీ అడ్వైజరీ బోర్డు చైర్మన్లు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.


మీసాలవాండ్లపల్లిలో వృద్ధులకు స్వీట్లు పంచిపెడుతున్న నాయకులు

నల్లమాడ: ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని మండలంలోని మీసాలవాండ్లపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. యర్రవంకపల్లి సర్పంచ్ రజనీకాంత్‌రెడ్డి,నాయకులు అశోక్‌కుమార్ యాదవ్, నరసింహులు, వెంకటేష్, సూర్యనారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. మసకవంకపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులు కేక్ కట్ చేసి గ్రామస్తులకు పంచిపెట్టారు. సర్పంచ్ ఎస్. అరుణమ్మ, మాజీ సర్పంచ్ ఎస్.రాంమోహన్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ జరిపిటి రవీంద్ర, సుధాకర, మునెప్ప పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడాకారిణికి ఆర్థిక సాయం


కీర్తనకు ఆర్థిక సాయం అందజేస్తున్న బత్తల హరిప్రసాద్

నల్లచెరువు: చైనాలో త్వరలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన మండల పరిధిలోని ఇందుకూరి పల్లికి చెందిన సాఫ్ట్ బాల్‌క్రీడా కారిణి కీర్తనకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్ శనివారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. సంపంగి గోవర్ధన్, బాలక్రిష్ణ యాదవ్ పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి పరీక్షలు

నల్లచెరువు: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉపార్లపల్లి గ్రామంలో డాక్టర్ యాస్మిన్ ఆధ్వర్యంలో శనివారం 60 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కింద దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు.

మంచి నడవడికతో మెలగండి


మాట్లాడుతున్న న్యాయమూర్తి జయలక్ష్మి

కదిరి టౌన్: పట్టణంలో ఉన్న సబ్ జైల్‌ను మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి జయలక్ష్మి శనివారం తనిఖీ చేశారు. ఖైదీల స్థితిగతులు, సమస్యలపై ఆరా తీశారు. ఖైదీలకు ఉన్న హక్కులను వివరించారు. మంచి నడవడిక కలిగి ఉండాలని సూచించారు. అనంతరం వంటగదిని పరిశీలించి ఖైదీలకు అందించే ఆహార నాణ్యతను పరిశీలించారు. జైలు సూపరింటెండెంట్ వాసుదేవరెడ్డి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లింగాల లోకేశ్వరరెడ్డి, న్యాయవాదులు నరసింహులు, వెంకటేష్, సిరాజుద్దీన్, రఘు పాల్గొన్నారు.

విత్తన నాణ్యత భేష్

కొత్తచెరువు: మండల పరిధిలోని ఇరంగంపల్లి పంచాయతీకి చేరిన రాయితీ విత్తన వేరుశనగ కాయలను శనివారం ఏఓ నటరాజ్, వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి, శ్రీనివాసులు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విత్తన కాయలు నాణ్యంగా ఉన్నాయని ఏఓ తెలిపారు.

ఖాద్రీశుని దర్శనానికి పోటెత్తిన భక్తులు


క్యూలైన్‌లో వేచియున్న భక్తులు

కదిరి టౌన్: శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. కదిరి పరిసరాల ప్రాంతాలతోపాటు చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాలనుంచి, కర్ణాటక నుంచికూడా భక్తులు తరలివచ్చి క్యూలైన్లలో వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదానం చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేసింది.

క్రమశిక్షణతో మెలగాలి


హోంగార్డులకు సూచనలిస్తున్న రాయలసీమ కమాండెంట్ మహేష్‌కుమార్

ధర్మవరం అర్బన్: విధుల్లో క్రమశిక్షణతో మెలగాలని హోంగార్డులుకు ఆ విభాగం రాయలసీమ కమాండెంట్ మహేష్‌కుమార్ సూచించారు. స్థానిక మార్కెట్‌యార్డు సమీపంలో శనివారం ధర్మవరం సబ్‌డివిజన్‌లోని హోంగార్డులకు పెరేడ్ నిర్వహించారు. అనంతరం రాయలసీమ కమాండెంట్ మహేష్‌కుమార్ మాట్లాడుతూ హోంగార్డుల విధులపై అవగాహన కల్పించారు. హోంగార్డులు ఈకేవైసీ చేయించినప్పటి నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో హోంగార్డులను ప్రభుత్వ ఉద్యోగిగా చూపిస్తోందని దీంతో హోంగార్డులకు ప్రభుత్వ పథకాలు అయిన అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, వృద్ధాప్య పింఛను, వితంతు పింఛను, దివ్యాంగుల పింఛన్లు తదితర పథకాలు అందడంలేదని ఈ సందర్భంగా ఆయన దృష్టికి హోంగార్డులు తీసుకెళ్లారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని కమాండెంట్ హామీనిచ్చారు. హోంగార్డుల ఇన్‌చార్జ్ ఆర్ఐ శ్రీశైలంరెడ్డి, ఏఆర్ఎస్ఐ శ్రీరాములు పాల్గొన్నారు.

31న గుండె వైద్యశిబిరం

తనకల్లు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారతీయ అంబేడ్కర్ సేన ఆధ్వర్యంలో ఈ నెల 31న గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు.

మాజీ ఎంపీటీసీకి ఎమ్మెల్యే నివాళి


నారపరెడ్డి మృతిపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

తాడిమర్రి: మడలంలోని పెద్దకోట్ల గ్రామంలో మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డిపల్లి నారపరెడ్డి(65) శనివారం మృతి చెందారు. ఇంటి వెనుక ఉన్న చీనీ తోటలో తిరుగుతూ కుప్పకూలి పోయాడు. కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తుండగానే మృతి చెందాడు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి గ్రామానికి చేరుకుని నారపరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతునికి భార్య నాగరత్నమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ఫోన్‌ద్వారా నారపరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు పాటిల్ ప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ వెంకటవరద, అల్లే సాయినాథ్‌రెడ్డి, అశ్వర్థరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, బాలం రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు.

నాణ్యమైన వైద్యసేవలే సత్యసాయి ట్రస్ట్ లక్ష్యం


వైద్య చికిత్స యూనిట్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌జే రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: సత్యసాయి వైద్య సంస్థల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ లక్ష్యమని ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు తెలిపారు. బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో ఉన్న సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ మెడికల్ సైన్సెస్‌లో రూ.5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన వైద్య పరికరాలను, శస్త్ర చికిత్సల గదులను శనివారం ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సత్యసాయి వైద్య సంస్థల ద్వారా నయాపైసా ఖర్చు లేకుండా నాణ్యమైన చికిత్సలు అందజేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో వైద్య సంస్థల డైరెక్టర్ సుందరేస్ దబీర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌బూత్ కమిటీ కన్వీనర్ల ఎంపిక


ఆదినారాయణరెడ్డి, నారపరెడ్డి, ఆంజనేయులు

పుట్టపర్తి: నల్లమాడ మండలానికి వైఎస్సార్‌సీపీ పోలింగ్ బూత్ కమిటీ కన్వీనర్లను ఎంపిక చేసినట్లు ఆ పార్టీ వర్గాలు శనివారం ఓ ప్రకటనలో తెలియజేశాయి. కమిటీ కన్వీనర్‌గా సద్దపల్లి ఆదినారాయణరెడ్డి, కో కన్వీనర్లుగా నారపరెడ్డి, ఆంజనేయులును నియమించారు. ఈ సందర్భంగా కన్వీనర్లు మాట్లాడుతూ తమపై నమ్మకంతో పదవులను ఇచ్చినందుకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తామని అన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక


వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: మండలంలోని వేళ్లమద్ది గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు శనివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ నాయకులు బొగ్గన రాధాకృష్ణ, మాజీ వార్డు మెంబర్లు బీ.కిష్ట, భాస్కర, కార్యకర్త జీ. బాబు, వారి కుటుంబ సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. ఏళ్లుగా టీడీపీలో పనిచేస్తున్నా గుర్తింపు లేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పుట్టపర్తి అభివృద్ధి కోసం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి చేస్తున్న కృషికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేళ్లమద్ది సర్పంచ్ బొజ్జేనాయక్, వైఎస్సార్ సీపీ నాయకులు టీడీ విజయభాస్కర్‌రెడ్డి, పార్టీ పంచాయితీ కన్వీనర్ శ్రీనివాసులు, రాంమోహన్ పాల్గొన్నారు.

ఘనంగా అక్కమ్మగార్ల జాతర


అక్కమ్మగార్ల దేవతల ఊరేగింపు

రామగిరి: కొత్తగ్యాదికుంట సమీపంలో అక్కమ్మగార్ల జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామదేవత అక్కమ్మగార్లను గ్రామంలో ఊరేగించారు. అనంతరం మహిళలు బోనాలు మోసుకుని అమ్మవారికి సమర్పించారు.

గనుల తవ్వకాలపై ప్రజాభిప్రాయ సేకరణ


సమావేశంలో పాల్గొన్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం నిడిమామిడి సమీపంలోని కొండపై గనుల తవ్వకాలకు సంబంధించి శనివారం నిడిమామిడి గ్రామంలో ఆర్డీఓ భాగ్యరేఖ, కాలుష్యనియంత్రణ మండలి అధికారి మురళీ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణకు సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్డీఓ మాట్లాడుతూ మైనింగ్ కోసం మూడు కంపెనీలు సుమారు 50 హెక్టార్లలో అనుమతులు పొందాయన్నారు. వాటి ఏర్పాటుతో ఇబ్బందులకన్నా లాభాలు అధికంగా ఉంటాయని సూచించారు. సమావేశంలో తహసీల్దార్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు షాదీఖానా ప్రారంభోత్సవం

కొత్తచెరువు: కొత్తచెరువులో పునరుద్ధరించిన షాదీఖానాను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆదివారం ప్రారంభిస్తున్నట్లు షాదీఖానా కమిటీ నూతన చైర్మన్ కోల్‌కార్ జాకీర్ తెలిపారు. రూ.35 లక్షల వక్ఫ్‌బోర్డు నిధులు మంజూరుకు ఎమ్మెల్యే సహకరించారని ఆయన తెలియజేశారు. మైనార్టీ ప్రజలు హాజరు కావాలని కోరారు.

పొట్టి శ్రీరాములుకు భారత రత్న ఇవ్వాలి


వేణుగోపాల్‌ను సన్మానిస్తున్న కోటా సత్యం

పుట్టపర్తి టౌన్: ఆంధ్రరాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ఇవ్వాలని అమరజీవి పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ ట్రస్టు వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఆ ట్రస్టు రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులైన ధర్మవరానికి చెందిన వ్యాపారవేత్త, ఆర్యవైశ్య సంఘం ప్రముఖుడు సాయిప్రసాద్‌కు శనివారం ఆయన ఆర్యవైశ్య సంఘం నేత కోటా సత్యం చేతుల మీదుగా నియామకపత్రం అందజేశారు. వేణుగోపాల్ మాట్లాడుతూ అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, గన్నవరం విమానాశ్రయానికి పొట్టి శ్రీరాములు పేరుపెట్టాలని, రాష్ట్ర అవతరణ దినం రోజున సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. అనంతరం వేణుగోపాల్‌ను సత్కరించి సత్యసాయి బాబా చిత్రపటాన్ని అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయండి


ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారునితో గ్రూప్ ఫొటో తీసుకుంటున్న అధికారులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని జగనన్న లేఔట్-1లో శనివారం మండల అధికారులు హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్కడ జరుగుతున్న ఇంటి నిర్మాణాలను హౌసింగ్ ఏఈ రాజశేఖర్ పరిశీలించారు. నిర్మాణంలో ఏవైనా ఇబ్బందులు పడుతున్నారా అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని ఏఈ సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మీ పాల్గొన్నారు.

వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగు

- అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు


మాట్లాడుతున్న ఆవుటాల రమణారెడ్డి, చిత్రంలో శాస్త్రవేత్తలు, అధికారులు

నల్లమాడ: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా పంటల సాగు చేపట్టాలని రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. వాతావరణ ఆధారిత సాంకేతిక సలహాలపై స్థానిక సాధన మండల సమాఖ్య కార్యాలయ సమావేశ భవనంలో శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ సహదేవరెడ్డి, డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ సుధీర్, డాక్టర్ ఉమాదేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి హాజరయ్యారు. ముందుగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వాతావరణాన్ని బట్టి పంటల మార్పిడి చేపట్టి, అవసరమైన మేరకు ఎరువులు వాడితే మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. కందిలో నూతన వంగడాలను వివరించారు. డీఏఓ సుబ్బారావు మాట్లాడుతూ వేరుశనగలో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్న విత్తనాలు, ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని ఆవుటాల రమణారెడ్డి కోరారు. కదిరి ఏడీఏ సత్యనారాయణ మాట్లాడుతూ.. చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రఘునాథరెడ్డి, మండల వ్యవసాయాధికారి సుమతి, ఏపీ మాస్ సిబ్బంది గోపాలరాజు, ఈశ్వరరెడ్డి, రాజశేఖరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకోవాలి


వాహన చోదకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంవీఐ వరప్రసాద్, సీఐ తమ్మిశెట్టి మధు

కదిరి అర్బన్: ట్రాఫిక్ జామ్ అయినపుడు, సిగ్నల్ వద్ద బండి ఆపాల్సివస్తే ఇంజన్‌ను స్విచ్చాఫ్ చేసి ఉంచితే ఇంధన పొదుపుతో పాటు వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని కదిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాహన చోదకులకు శనివారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ సీఐ తమ్మిశెట్టి మధు పాల్గొన్నారు. ఎంవీఐ మాట్లాడుతూ ట్రాఫిక్‌లో జామ్ అయినపుడు కొన్ని వందల వాహనాల వెలువడే పొగ ఆ ప్రాంతమంతా విస్తరించి వాతావరణ కాలుష్యానికి దారితీస్తుందన్నారు. ఎక్కడ పడితే అక్కడ హారన్ మోగించరాదన్నారు. అనంతరం వాహన చోదకులతో పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు.

నల్లచెరువు: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని కదిరి ఆర్టీఓ వరప్రసాద్ సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులతో సమావేశమై పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కాల పరిమితి మించిన వాహనాలను ఉపయోగించవద్దని, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారు వాహనాలు నడపవద్దని సూచించారు. నల్లచెరువు పోలీస్ అధికారులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

రెడ్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలం

- ఏపీ రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌రెడ్డి


మాట్లాడుతున్న రెడ్డి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంగులకుంట నరేష్‌రెడ్డి

పుట్టపర్తి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రెడ్ల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఏపీ రెడ్డి సంఘం వ్యవస్థాపక అధక్షుడు గంగులకుంట నరేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన పుట్టపర్తిలో విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలకు, హోదాలకు అతీతంగా రెడ్లలో ఐక్యతను తెచ్చేందుకు రెడ్ల ఐక్య చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. రెడ్లు తమ సమస్యలను సంఘానికి తెలియజేస్తే ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారన్నారు. సంఘం ఆధ్వర్యంలో జిల్లాల్లోని నియోజకవర్గ కేంద్రాల్లో కమ్యూనిటీ భవన నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం భూములు కేటాయించాలని కోరారు. సమావేశం అనంతరం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగభూషణరెడ్డి, నాయకులు ముత్యాలరెడ్డి, మహేంద్రరెడ్డి, రవిరెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఆలయ ప్రారంభోత్సవ పోస్టర్ల విడుదల

పుట్టపర్తి అర్బన్: భక్తుల కొంగుబంగారమైన పుట్టపర్తి మండలం గంగిరెడ్డిపల్లి వద్ద కొలువైన అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవానికి సంబంధించి పోస్టర్లను ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి శనివారం గ్రామస్తులతో కలిసి విడుదల చేశారు. సుమారు రూ.కోటితో పునరుద్ధరించిన ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే సైతంఆర్థిక సహాయం అందించారు. జూన్1,2,3వ తేదీల్లో జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్ కామాక్షమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదెప్ప, రామక్రిష్ణ, వెంకటరాముడు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పరామర్శ

తాడిమర్రి: ఓ ఘటనలో తలకు గాయాలై చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న పెద్దకోట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గద్దె శివారెడ్డిని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి శనివారం పరార్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. శివారెడ్డి పిల్లలు, వారి చదువులు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవలు

పుట్టపర్తి అర్బన్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ జ్యోత్స్న శనివారం పుట్టపర్తి మండలం మార్లపల్లి గ్రామంలో పర్యటించారు. గర్భిణులు, బాలింతలు, మంచం పట్టిన రోగులకు వైద్యం అందించారు. వడదెబ్బ నివారణపై జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

నాడు–నేడు పనుల పరిశీలన

ఎన్‌పీకుంట: పీ కొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులను ఎంపీడీఓ ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కేశవరెడ్డి శనివారం పరిశీలించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ప్రధానోపాధ్యాయురాలికి సూచించారు.

గోదాములకు చేరుతున్న విత్తన వేరుశనగ


విత్తనకాయలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

కనగానపల్లి: సబ్సిడీ విత్తన వేరుశనగ మొదటి విడత కింద మండలానికి 2,005 క్వింటాళ్లు కేటాయించగా ఇప్పటి వరకు 650 క్వింటాళ్లు గోదాములకు చేరినట్లు ఏఓ క్రిష్ణకుమారి తెలిపారు. శనివారం మండలంలోని కుర్లపల్లి, ముక్తాపురం, ముత్తువకుంట్ల గ్రామాల్లోని ఆర్‌బీకేలకు విత్తన కాయలు చేరాయని వీఏఏలు తెలిపారు.

కార్మికుడు ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని తారకరామాపురంలో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు వేణుగోపాల్ శనివారం తన భార్యతో గొడవపడి ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే అతన్ని అనంతపురం ఆస్పత్రికి తరలించినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.